

ఆకట్టుకుంటున్న కళాకృతులు
కురుపాం మండలంలోని దురుబిలి గ్రామానికి చెందిన గిరిజన హస్తకళాకారుడు తోయక బాబూరావు రూపొందిస్తున్న కళాకృతులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - 8లో



వైభవోపేతంగా కనకమహాలక్ష్మి మారు జాతర
ఉత్తరాంధ్ర ఇలవేల్పు కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర మహోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. - 8లో



ఏకాంత సీతారాములకు డోలా యాత్ర..!
సంతకవిటి మండలంలోని గుళ్ల సీతారాంపురం గ్రామంలో గల ఆలయంలో సీతారాములు మాత్రమే ఉంటారు. అందుకే ఈ ఏకాంత సీతారాముల ఆలయం అని పేరు వచ్చింది - 8లో

న్యూస్‌రీల్

ఫ్లూ వైరస్‌పై అప్రమత్తం

- సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్



విజయనగరం ఫోర్ట్: ఢిల్లీలో హెచ్ 3, ఎన్ 2 ఫ్లూ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని, జిల్లాలో ప్రస్తుతానికి ఫ్లూ వైరస్ కేసులు నమోదుకానప్పటికీ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, పలమనాలజిస్టు డాక్టర్ బొత్స సంతోష్ ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. హెచ్ 3, ఎన్ 2 సోకితే సాధారణ జలుబు, దగ్గు, జ్వరం, నీరసం ఉంటుందన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, అతనితో చేతులు కలిపినప్పుడు ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలని పేర్కొన్నారు.

వేణుగోపాలునికి తులాభార సేవ



జామి: అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వేదపండితుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్వామి వారికి తులాభార సేవ నిర్వహించారు. ఆదివారం ఉదయం హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి తులాభారసేవ, పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతితో 'సాగు'దాం



నవధాన్యాల సాగుపై వెదురువాడ రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు

బొండపల్లి: ప్రధానపంట సాగుకు ముందు నవధాన్యాలు సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుందని, పంటకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని ప్రకృతివ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు తెలిపారు. బొండపల్లి మండలం కొవ్వాడపేట, వెదురువాడ గ్రామాల్లో ఆదివారం నవధాన్యాల సాగువల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం గజపతినగరం సబ్‌డివిజన్ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం రీసెర్చ్ సహాయకురాలు నీలిమ, బి.రాజేరు సచివాలయం వీవీఏ నాగమణి, మెపాడ రామ్మూర్తి పాల్గొన్నారు.

జరభద్రం..!

ఒక ప్రమాదం నిండు ప్రాణాలను తీస్తోంది. క్షతగాత్రులుగా మార్చుతోంది. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణించడం.. మద్యం సేవించి వాహనాలు నడపడం.. అతివేగం.. డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వెరసి రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రతి శనివారం నో యాక్సిడెంట్ పేరిట పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. ప్రైవేటు వాహన డ్రైవర్లలో మార్పు కనిపించడం లేదు. గమ్యానికి చేరుకోవాలన్న ప్రయాణికుల ఆతృత కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు
- డ్రైవింగ్‌లో నిర్లక్ష్యంతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు
- జిల్లాలో మూడేళ్లలో 841 రోడ్డు ప్రమాదాలు
- ప్రమాదాల నివారణపై పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి
- ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే పేరిట అవగాహన



ఎట్టణంలో నో యాక్సిడెంట్ డే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురంటౌన్: ' కొమరాడ మండలం అంటివలస గ్రామానికి చెందిన సుమారు 13 మంది ఒకే ఆటోలో పెళ్లిచూపులకు వెళ్లారు... తిరిగి వస్తుండగా చోళ్లపథం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాతపడ్డారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. దీనికి రోడ్డు భద్రతా నిబంధనలపై డ్రైవర్‌కు అవగాహన లోపమే కారణం'. పోలీసులు హెచ్చరిస్తున్నా.. ప్రమాదమని పదేపదే చెబుతున్నా యువత హెల్మెట్ ధరించకుండానే బైక్‌లపై ప్రయాణిస్తున్నారు. వేగంగా దూసుకెళ్తూ ప్రమాదాలపాలవుతున్నారు. మరికొందరిని ప్రమాదాలకు గురిచేస్తున్నారు. కొందరు ఆటోవాలాలు సైతం సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. సరుకు రవాణా వాహనాల్లోనూ కూలీలను పొలాలకు తీసుకెళ్తున్నారు. ఏడుగురికి చోటున్న వాహనంలో 20 మందిని ఎక్కిస్తున్నారు. పోలీసులు హెచ్చరిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. కేసులు నమోదు చేస్తూ.. జరిమానా విధిస్తున్నా డబ్బులు ఎక్కువగా వస్తాయన్న ఆశతో అధికమంది ప్రయాణికులను ఎక్కిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. అలాంటి ఆటోలు, ప్రైవేటు వాహనాలను ప్రయాణికులే బహిష్కరించాలని కోరుతున్నారు.

పాటించాల్సిన నిబంధనలు ఇవీ...

- ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదు.
- వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి.
- వాహనాలను ఇష్టానుసారంగా రహదారులపై నిలుపరాదు.
- పాఠశాలల బస్సులు, ఆటో డ్రైవర్లు వేగ పరిమితి నిబంధన పాటించాలి.
- తల్లిదండ్రులు ఆటోలో వెళ్లే విద్యార్థుల సంఖ్యను గమనించాలి.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం



ఆటోలు నడపడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చినప్పుడు ఆటోడ్రైవర్లను సమావేశపరచి నిబంధనలను వివరిస్తున్నాం. అయినప్పటికీ అక్కడక్కడా ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యాత్మక మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తాం.

– సి.మల్లికార్జున రెడ్డి, జిల్లా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



ఆటో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాం. ప్రతిశనివారం నో యాక్సిడెంట్ డే నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన లేకపోవడం, ఎంతవేగంలోనైనా వాహనాన్ని ఇట్టే నియంత్రించగలననే అతి విశ్వాసమే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం ప్రమాదకరం. రహదారి భద్రత నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– విద్యాసాగర్ నాయుడు, ఎస్పీ, పార్వతీపురం మన్యం

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	292	82	401
2021	281	94	385
2022	268	75	439

దరఖాస్తుల ఆహ్వానం



జిల్లా కన్వీనర్ మూకల పెంటయ్య

సాలూరు: జిల్లాలోని జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కన్వీనర్ మూకల పెంటయ్య ఆదివారం తెలిపారు. ఎమ్‌జేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో వచ్చేనెల 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతిభ పరీక్ష ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామని చెప్పారు. సాలూరు బాలికల గురుకుల పాఠశాలలో 80 సీట్లు, పార్వతీపురం బాలికల గురుకుల పాఠశాలలో 40 సీట్లు, కురుపాం బాలుర పాఠశాలలో 40 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. జిల్లాలో ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. 74 శాతం బీసీ, 15 శాతం ఎస్సీ, 6 శాతం ఎస్టీ, 3 శాతం అనాథ, 2 శాతం ఈబీసీ, ఇతర కులాల విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు.

టీబీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: టీబీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర టీబీ అసోసియేషన్ వార్షిక సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ప్రసాద్ స్థానిక విలేకరులకు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా గవర్నర్, ఉపాధ్యక్షులుగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారన్నారు. చైర్మన్‌గా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైస్ చైర్మన్‌గా విజయవాడకు చెందిన డాక్టర్ రామకృష్ణ, ఆరోగ్యవరం నుంచి డాక్టర్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ జయకర్‌బాబు ఎన్నికయ్యారు.

సుధాకర్ గెలుపు మనందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో దిగిన సీతంరాజుసుధాకర్ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా ముందుకు సాగాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. విజయనగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్ లో పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన విజయనగరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి మంత్రి బొత్సతో పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఆరు జిల్లాల పరిధిగా నిర్వహిస్తోన్న పట్టభద్రుల ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో 60వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్‌లో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు.

- ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా గడపగడపకు వెళ్లి పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించాలన్నారు. టీడీపీ మోసపూరిత పాలనపై విజ్ఞానవంతులైన పట్టభద్రులకు గుర్తుచేయాలని కోరారు.
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ ప్రజారంజక పాలన పార్టీ సూచించిన అభ్యర్థి విజయానికి దోహదపడుతుందన్నారు. ఈ నెల 3,4 తేదీల్లో విశాఖ వేదికగా దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా గ్లోబల్ సమ్మిట్‌ను ప్రభుత్వం నిర్వహించడం ద్వారా త్వరలో 60 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఉద్యో గ సంఘాలు ప్రభుత్వానికి సానుకూలంగా ఉన్నారని, ప్రతి పట్టభద్రుని కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించాలని పిలుపునిచ్చారు.

'ఐ'య్యో దేవుడా..!

- పొడిబారుతున్న నేత్రాలు
- అధికంగా సెల్‌ఫోన్, కంప్యూటర్ వాడకం, వేసవిలో జాగ్రతలు పాటించకపోవడం వల్ల సమస్యలు



పొడి బారిన కన్ను



కంటి రోగిని తనిఖీ చేస్తున్న నేత్ర వైద్యాధికారి

గుమ్మలక్ష్మీపురం: శరీరంలో ఏ అవయవానికి బాధ కలిగినా ఆ బాధను కళ్లే వ్యక్త పరుస్తాయి. ప్రకృతి అందాలను కళ్లున్న ప్రతి ఒక్కరూ చూసి ఆస్వాదించి మధురానుభూతి పొందుతుంటారు. ఆ కళ్లే మసకబారిపోతే.. కనిపించకపోతే జీవితమే అంధకారమవుతుంది. ఆ ఊహలే భరించలేనప్పుడు అంధకారానికి చోటివ్వకుండా ఉండాలంటే కంటి విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోక తప్పదు. కృత్రిమ కాంతికి తోడు వాతావరణంలో మార్పులతో చిక్కులు సాధారణంగా మొబైల్‌ను చేతితో పట్టుకుంటుంటే చూపు స్క్రీన్ పైనుంచి పక్కకు వెళ్లదు. ఒంటరిగా కూర్చున్నా, పదిమందిలో ఉన్నా బస్సు, రైలు ప్రయాణాలతో పాటు బైక్‌పై ప్రయాణించినా మొబైల్ తప్ప మరో ధ్యాస ఉండడం లేదు. ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సూర్యాస్తమయం ముందే తినేసి, రాత్రి చీకటి కాగానే పడుకునేవారు. ఇదీ అప్పటి జీవన శైలి. ఇప్పుడు పగటి కంటే రాత్రిళ్లే ఎక్కువగా మేల్కొంటున్నారు. ఈ క్రమంలో మొబైల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లనే వినియోగిస్తున్నారు. వాటినుంచి ప్రసరించే కృత్రిమ కాంతిలో ఉండే బ్లూలైట్ వల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. మొబైల్ కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడడం దానిలోని రేడియేషన్, అల్ట్రావైలట్ రేస్ వల్ల కళ్లలో నీళ్లింకిపోయి పొడి బారుతున్నాయి. దీనికి తోడు వాతావరణంలో నెలకొనే వేడిమి, వడగాల్పులు, వర్షాకాలంలో వచ్చే కండ్ల కలక వంటి వ్యాధులతో కూడా కంటిలో అనేక మార్పులు జరుగుతుంటాయి. ముఖ్యంగా వేసవి కాలంలో బయట ఎక్కువ ఉష్ణోగ్రతల కారణంగా కనుగుడ్డు బాగా పొడిబారి కంటిలో ఉన్న భాగాలు దెబ్బతినే ఆస్కారం ఎక్కువ ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి

- ప్రతి అరగంటకు ఒకసారి మొబైల్/కంప్యూటర్/ల్యాప్‌టాప్ నుంచి కనీసం రెండు మూడు నిమిషాలైనా దృష్టిని వేరే వైపు మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగుళాల దూరం ఉంచాలి
- యాంటీగ్లేర్, యాంటీ రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్ల మంటలు, నీరుకారడం వంటి సమస్యలుంటే కాసేపు తెరను చూడడం ఆపేయాలి
- తరచూ చల్లని నీటితో కళ్లు కడుక్కోవాలి. రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి వస్త్రం కప్పి ఉంచాలి.
- కంటికి కసరత్తు అవసరం. ఇందు కోసం కళ్లను కుడి, ఎడమలకు అరనిమిషం నుంచి నిమిషం పాటు తిప్పాలి. రెండు అరచేతులు రుద్దుకుని వేడెక్కిన తర్వాత కళ్లపై కాసేపు ఉంచే కసరత్తు చేయాలి.
- ఎండలో బయటకు వచ్చేటప్పుడు చలువ కళ్లద్దాలు పెట్టుకోవడం, గొడుగు కింద నడవడం, సేద దీరినప్పుడు ముఖాన్ని కడుక్కోవడం చేస్తే కంటికి ఎటువంటి ప్రమాదం ఉండదు

సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే అనర్థం



ఎక్కువగా కళ్లు పొడి బారడం, ఎర్రగా కావడం, కళ్లలో మంటలు, దురద వంటి సమస్యలతో బాధపడుతున్న వారు వైద్యం నిమిత్తం వస్తున్నారు. అధికంగా మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను వినియోగించడం, ఎటువంటి రక్షణ లేకుండా అధిక ఉష్ణోగ్రతల్లోకి వెళ్లడం వల్లే ఈ సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. కంటి సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే అనర్థాలు తప్పదు.

– జీరు నగేష్ రెడ్డి, నేత్ర వైద్యాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

• సండే సందడి



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న యువత



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

సీతంపేట అడ్వంచర్ పార్కులో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సాహస క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటుషికారు, బంజీట్రంపోలిన్, హ్యాంగింగ్ బ్రిడ్జి, షూటింగ్ ఆటల్లో పాల్గొన్నారు. కుటుంబాలతో కలిసి ఆనందంగా గడిపారు. -సీతంపేట

రైల్వేస్టేషన్లకు ఆధునిక సొబగులు

విజయనగరం టౌన్: విశాఖ డివిజన్ పరిధిలోని 16 రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నట్టు డీఆర్ఎం అనూప్‌కుమార్ శత్పథి తెలిపారు. విజయనగరం రైల్వేస్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్లాట్‌ఫారాలు, ఇంటర్‌నెట్ కనెక్షన్, ప్రయాణికులకు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పర్లాకిమిడి నుంచి విశాఖ పట్టణం వరకు ఉన్న వివిధ స్టేషన్లను రోజువారీగా పరిశీలిస్తున్నామని చెప్పారు. రైల్వేస్టేషన్లో చేపట్టబోయే ఆధునీకరణ పనుల నివేదికను కేంద్రానికి పంపించామని వివరించారు. ఇప్పటికే విశాఖ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించామని చెప్పారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన ఆటో

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం–బొద్దూరు గ్రామాల మధ్య ఆదివారం ఆటో బోల్తాపడడంతో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి నుంచి రాజాం వెళ్తున్న ఆటో, ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గొర్లె షన్ముఖరావుకు గాయాలు కాగా, ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సంతకవిటి మండలం బూరాడపేట గ్రామానికి చెందిన ఎం.ప్రసాద్‌తో పాటు బైక్ వెనుక ఉన్న వంగర మండలం శివ్వాం గ్రామానికి చెందిన బి.లక్ష్మణరావులకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను జి.సిగడాం మండలంలోని సామాజిక ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించగా చికిత్స పొందుతున్నారు.

దోమలమందు తాగి ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న తవిటమ్మ

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం గొర్లి గ్రామానికి చెందిన మెల్లక తవిటమ్మ మనస్తాపం చెదిన ఇంట్లో ఉన్న దోమల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొద్ది నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తవిటమ్మ చినమేరంగి పీహెచ్‌సీలో వైద్యం పొందుతోంది. అయితే ఎప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉన్న దోమల మందు తాగేసింది. ఈ విషయాన్ని ఆమె భర్త చక్రపాణి గమనించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఆరుగురి ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అండర్–7,17 చెస్ క్రీడాకారుల ఎంపికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. నగరంలోని రింగ్‌రోడ్ ప్రాంతంలో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 50మంది క్రీడాకారులు హాజరుకాగా..అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపిక పోటీల్లో అండర్–7 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పి.జయదీప్‌నాయుడు, డి.హర్షిత్‌లు జూన్ నెలలో విజయనగరం వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే అండర్–17 విభాగంలో సీవీఆర్.కార్తీక్, కె.ప్రహ్లాద్, ఎ.శ్రీనిధి, జి.లక్ష్మీకుందన ప్రియలు మే నెలలో అనకాపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపిక పోటీలకు న్యాయ నిర్ణేతగా సైదాబేగం వ్యవహరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24క్యారెట్లు. 10గ్రా.)	56,150–00
బంగారం(22క్యారెట్లు. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹ 214

ఆకట్టుకుంటున్న కళాకృతులు

- హస్త కళానైపుణ్యంతో అందమైన ఆకృతులు చేస్తున్న గిరిజనుడు
- విజయనగరం, విశాఖపట్నం, ఒడిశాల్లో కళారూపాలకు మంచి గిరాకీ



ఈతరేకులతో అల్లిన టీ-ట్రే



ఈతరెమ్మలతో అందమైన కళాకృతులు తయారు చేస్తున్న గిరిజన హస్తకళాకారుడు బాబూరావు



కూరగాయలు పెట్టుకునే పాత్ర



ఈతరెమ్మలతో రూపొందించిన మేట్

కురుపాం: మండలంలోని బియ్యాలవలస పంచాయతీ, దురుబిలి గ్రామానికి చెందిన గిరిజన హస్తకళాకారుడు తోయక బాబూరావు రూపొందిస్తున్న కళాకృతులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్లాస్టిక్ వస్తువులు రాజ్యమేలుతున్న ఈ ఆధునిక సమాజంలోకి మళ్లీ సంప్రదాయ వస్తువులను తీసుకువచ్చి, ఆరోగ్యకర వాతావరణానికి కృషి చేస్తుండడాన్ని ప్రకృతి ప్రేమికులు హర్షిస్తున్నారు. ఈతరేకులు, వెదురుకర్రలతో అందమైన కళారూపాలు తయారు చేస్తున్నారు. ఆయన హస్తకళానైపుణ్యం నుంచి జాలువారిన పూలసజ్జలు, పూలకుండీలు, కౌబాయ్ టోపీలు, చాపలు, మేట్‌లు, చేటలకు విజయనగరం, విశాఖపట్నం, ఒడిశాలోని పలు ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. చిన్నప్పటి నుంచి అలవడిన ఈ కళ ద్వారా ఉపాధి లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి జరుగుతుండడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

నవధాన్యాలతో భూసారం

- సాగు చేసేందుకు రైతుల ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయ అధికారులు
- 2023–24లో సాగు లక్ష్యం 75 వేల ఎకరాలు



నవధాన్యాల పంట

విజయనగరం ఫోర్ట్: నవధాన్యాల సాగు భూసారాన్ని పెంచే సంజీవని లాంటిది. ఈ క్రమంలో నవధాన్యాలు, పచ్చి రొట్ట పైరు విస్తీర్ణం పెంచడానికి వ్యవసాయ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు నవధాన్యాల సాగు ప్రాముఖ్యతను రైతులకు వివరిస్తున్నారు.రైతులు స్వచ్ఛందంగా సాగుచేసేలా చైతన్య పరుస్తున్నారు. ఫలితంగా వీటి సాగు ఏటా పెరుగుతోంది. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పంటల సాగులో పెరిగిపోయింది. ఫలితంగా భూసారంతో పాటు పంట దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. అంతేకాకుండా పంటలు చీడపీడలు, తెగులు బారిన పడుతున్నాయి. నాణ్యమైన పంట రావడం లేదు. రసాయన ఎరువులు, పురుగు మందులతో పండించిన పంటలు తినడం వల్ల జనం బీపీ, షుగర్, స్థూలకాయం వంటి వ్యాధుల బారిన పడుతున్నారు.

భూసారాన్ని పెంచేందుకు..

గతంలో భూమిలో తగ్గిపోతున్న భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పైరు అయిన జీలుగ, కట్టి జనుము సాగుచేసి 40 రోజుల తర్వాత వాటిని దమ్ములో కలియదున్నేవారు. పచ్చి రొట్ట పైరుతో పాటు నవధాన్యాలను కూడా ఇప్పుడు సాగు చేస్తున్నారు.

వరికి ముందు వేసే విత్తనాలు:

పప్పు దినుసుల్లో మినుము, పెసర, బొబ్బర్లు, అలసంద, చిరుధాన్యాల్లో రాగులు, కొర్ర, సామ, ఊద, గంటి, అరికలులు , నూనె జాతిలో నువ్వులు, వేరుశనగ, కూరగాయల్లో చిక్కుడు, ఆనప, బీర, సుగంధ ద్రవ్యాల్లో మెంతులు, ఆవాలు, ధనియాలకు సంబంధించి 18 రకాల విత్తనాలను ఎకరాకి 12 కేజీలు చొప్పన పొలాల్లో జల్లుతారు. ఇవి 40 రోజుల తర్వాత పూత దశలో ఉన్నప్పుడు దమ్ములో కలియదున్నుతారు.

కలియదున్నడం వల్ల ఉపయోగాలు

- భూమి గుల్ల బారుతుంది
- వానపాముల సంఖ్య పెరుగుతుంది
- భూమిలో ఉపయోగకర సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుంది
- సేంద్రియ కర్బన శాతం అధికమవుతుంది
- నేల ఆరోగ్యకరంగా ఉంటుంది
- నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి అవుతాయి.

పెరుగుతున్న సాగు

2022–23లో 34 వేల ఎకరాల్లో నవధాన్యాలు సాగయ్యాయి. అదేవిధంగా పచ్చి రొట్ట పైర్లు 20 వేల ఎకరాల్లో సాగయ్యాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్‌లో 75 వేల ఎకరాల్లో నవధాన్యాలు, 50 వేల ఎకరాల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిని సాగు చేసే రైతులను అధికారులు ప్రోత్సహిస్తున్నారు. నవధాన్యాలను సిద్ధం చేయడం గురించి వివరిస్తున్నారు.

సాగు పెరుగుతోంది:



నవధాన్యాల సాగు జిల్లాలో పెరుగుతోంది. రైతులు ఆశక్తి కనబరుస్తున్నారు.నవధాన్యాలతో పాటు, పచ్చి రొట్ట పైరు సాగుకూడా పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. నవధాన్యాలను సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. ఎరువుల వినియోగం తగ్గుతుంది.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

వైభవోపేతంగా కనకమహాలక్ష్మి మారు జాతర

- దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- భారీ అన్న ప్రసాద వితరణ



మారు జాతరలో పూజలు అందుకున్న కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర మహోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో అమ్మవారి 25వ జాతర మహోత్సవాలు వేడుకగా జరిగిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ఆదివారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర ఉత్సవాలను ఆలయ కమిటీ నిర్వహించింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. తల్లీ కాపాడు అంటూ భక్తులు పసుపు, కంకుమలతో మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్‌చైర్మన్ సూరు కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, మంగళగిరి శ్రీను, కమిటీ సభ్యులు కంది శ్రీరాములు, వంకల కృష్ణ, అప్పలనాయుడు, అద్దాల రవి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి



కుక్కలదాడిలో మృతిచెందిన జింక పిల్ల

సీతానగరం: మండలంలోని జోగింపేట బాలయోగి గురుకుల విద్యాలయంలో జింకపిల్లపై కుక్కలు దాడి చేసి హతమార్చాయి. ఆదివారం ఉదయం రేపటివలస కొండనుంచి జింకపిల్ల జోగింపేట బాలయోగి గురుకులం ప్రాంగణంలోకి గోడ గెంతి వచ్చింది. అక్కడే ఉన్న కుక్కలు ఆ జింకపిల్లపై దాడి చేశాయి. దాడిలో గాయాలపాలైన జింకపిల్లను సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు పార్వతీపురం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అటవీశాఖ అధికారి మనోజ్ వచ్చి జింకపిల్లను పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం జింక కళేబరాన్ని గురుకుల విద్యాలయానికి సమీపంలో పూడ్చివేశారు.

కారు బోల్తా పడి వ్యక్తి మృతి



శేషగిరిరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

పాలకొండ: మండలంలోని అట్టలి జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా మందస మండలం పొత్తంగి గ్రామానికి చెందిన శేషగిరిరావు కటుంబసభ్యులతో కలిసి పార్వతీపురం మన్యం జిల్లాలో బంధువుల ఇంట్లో బారసాల ఫంక్షన్‌కు కారులో వెళ్లారు. భోజనాల అనంతరం తిరుగుప్రయాణంలో పాలకొండ మండలం అట్టలి గ్రామం వద్ద ఉన్న మలుపును డ్రైవర్ గమనించక పోవడంతో రోడ్డు పక్కనే ఉన్న కానాను కారు బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న శేషగిరిరావు కారు అద్దాన్ని గుద్దుకోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ రుద్రయ్య తో పాటు కారులో ఉన్న మిగతావారికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలుగు చూసిన వీఓఏ అక్రమాలు



సంతకవిటి : వీఓఏ అక్రమాలపై గ్రామ సచివాలయంలో దర్యాప్తుచేస్తున్న అధికారులు

సంతకవిటి: మండలంలోని జీఎస్‌పురం గ్రామైక్య సంఘం వీఓఏ చేసిన అక్రమాలను వెలుగు అధికారులు బయటపెట్టారు. గ్రామానికి చెందిన పలు డ్వాక్రా సంఘాల సభ్యులు వారి వీఓఏ అక్రమాలకు పాల్పడినట్లు గతంలో ఫిర్యాదు చేశారని ఏపీఎం డి.సీతారాం వెల్లడించారు. దీంతో పంచాయతీ సర్పంచ్ పి.ఈశ్వరరావు సమక్షంలో శని, ఆదివారాల్లో గ్రామ సచివాలయం వద్ద రికార్డులు పరిశీలించామని తెలిపారు. ఈ రికార్డుల ఆధారంగా వీఓఏ విమల సంఘ సభ్యులకు తెలియకుండా సంతకాలు ఫోర్జరీ చేసి రూ.7,20,996 నగదు స్వాహా చేసినట్లు ఏపీఎం తెలిపారు. దర్యాప్తులో శ్రీ వెంకటేశ్వర సంఘం నుంచి రూ.97,50, గణేష్ సంఘం నుంచి రూ.1,03,300, ప్రియాంక సంఘం నుంచి రూ. 2,52,671, ఆంజనేయ సంఘం నుంచి రూ. 8,068, జై దుర్గ సంఘం నుంచి రూ.60 వేలు, యేసు సంఘం నుంచి రూ.53,240, కరుణామయుడు సంఘం నుంచి రూ. 1,44,317 డ్రా చేసినట్లు గుర్తించామని ఏపీఎం మీడియాకు వివరాలు వెల్లడించా రు. మొత్తం రూ. 7.20 లక్షల అక్రమాలు జరిగినట్లు తెలిసిందని, మరింతగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రాథమిక ధర్యాప్తు అనంతరం వీఓఏ తన తప్పును అంగీకరించి, ఈ నగదును ఈనెల 20 లోగా చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా రాసిఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఏకాంత సీతారాములకు డోలా యాత్ర..!

- రేపటి నుంచి నిర్వహణ
- సిద్ధమైన ఆలయం
- ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ



ఆలయంలో రాతిగోడలపై శిల్పాలు





400ఏళ్ల చరిత్ర కలిగిన సీతారాముల ఆలయం (ఇన్‌సెట్లో) ఏకాంత సీతారాములు



అందమైన నగిషీలు

రాజాం/సంతకవిటి: ఎక్కడైనా సీతారాముల ఆలయాల్లో సీతారాములతో పాటు లక్ష్మణుడు కూడా ఉంటారు. అయితే సంతకవిటి మండలంలోని గుళ్ల సీతారాంపురం గ్రామంలో గల ఆలయంలో సీతారాములు మాత్రమే ఉంటారు. అందుకే ఈ ఏకాంత సీతారాముల ఆలయం అని పేరు వచ్చింది. ఈ ఆలయంలో సీతారాముల డోలాయాత్ర ఈనెల 7 నుంచి జరగనుంది. ఆలయ అర్చకుడు భోగాపురపు ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ ఈ యాత్రకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పంచాయతీ సర్పంచ్ రావు రవీంద్ర వెల్లడించారు. 7న స్వామివారి ఆలయం వద్ద యాత్ర ప్రారంభమవుతుందని, ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. 8న ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలకు తిరువీధి మహోత్సవం, పల్లకి సేవ, ఉత్తరముఖ మంటపంలో భక్తులకు దర్శనం ఏర్పాటుచేస్తారని తెలిపారు. అదేరోజు ఆలయంలో కూడా దర్శనాలు ఉంటాయని, 9న డోలోత్సవంతో యాత్ర ముగిస్తుందని వివరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో ఏకాంత సీతారాములు దర్శనానికి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని దేవాదాయశాఖ ఈఓ బీవీ మాధవరావు తెలిపారు.

నాలుగువందల ఏళ్ల చరిత్ర..

గుళ్లసీతారాంపురంలోని సీతారాముల ఆలయాన్ని 16వ శతాబ్దంలో బొబ్బిలి రాజులు నిర్మించారు. విహార యాత్రతో పాటు అడవి మృగాలను వేటాడేందుకు బొబ్బిలిరాజులు ఇక్కడికి రాగా, రాజుల కలలో సీతారాములు కనిపించి ఇక్కడ ఆలయం నిర్మించమని చెప్పిన మేరకు ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఇక్కడ నిర్మించిన ఆలయం మాదిరిగానే అవే కొలతలు, డిజైన్‌తో బొబ్బిలిలో కూడా సీతారాముల ఆలయం ఉంది. ఇక్కడ ఆలయంలో గోడలుపై సింహపుతలల నగిషీలు, ప్రతిమలు పలువురిని ఆకట్టుకునే విధంగా ఉండడం విశేషం. ప్రాచీన భారతీయ శిల్ప సౌందర్యానికి, అప్పటి శిల్పకళాకారుల ఆర్కిటెక్ వైవిధ్యానికి ఈ కట్టడం నిలువెత్తు నిదర్శనం. ఏకరాతితో కూడుకున్న పెద్దపెద్ద శిలలతో ఈ ఆలయం చూడముచ్చటగా ఉంటుంది.

భగవంతుడికి భత్యం కరువు

ఈ సీతారాముల ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉంది. గుళ్లసీతారాంపురంతో పాటు పరిసర గ్రామాల్లో ఆలయానికి సంబంధించి 1200 ఎకరాల ఆస్తులు ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ కౌలు రైతుల పరిధిలో ఉండగా పైసా ఆదాయం కూడా లేదు. దీంతో ఈ ఆలయంలో ధూపదీప నైవేద్యాలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి ఏటా ఆలయ జాతరను అట్టహాసం లేకుండా దేవదాయశాఖ నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా జాతరను తూతూ మంత్రంగా నిర్వహిస్తుండడంతో భక్తులు దేవాదాయ శాఖ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.